క్లుప్తంగా

పాస్టర్లకు ఆర్థిక సాయం



పాస్టర్లకు నగదు అందజేస్తున్న దృశ్యం

పాణ్యం: స్థానిక షాలేము ప్రార్థన మందిరంలో ఆదివారం హోసన్న కృపా మినిస్ట్రీస్(కనిగిరి)డైరెక్టర్ పురుషోత్తం పాణ్యం నియోజకవర్గంలో 40మంది పాస్టర్లకు ఆర్థిక సాయం చేశారు. పాణ్యం మండలం పాస్టర్స్ అసోసియేసన్ అధ్యక్షుడు సునీల్ ఆధ్వర్యంలో ఒక్కోపాస్టర్‌కు రూ. 1,000 చొప్పున అందజేశారు. కార్యక్రమంలో హోసన్న కృపా మినిస్ట్రీస్ టీమ్ లీడర్ రెవరెండ్ లాజరస్(మార్కాపురం), రెవరెండ్ ఐజయ్య, షాలేము ప్రార్థన మందిరం సంఘ సభ్యులు సోమన్న, రోశన్న, ఆనందరావు, గుర్రప్ప, సుంకన్న, సురేష్, సిమోన్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఈర్లదిన్నెలో హెల్త్ క్యాంప్

సి.బెళగల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా సోమవారం సి.బెళగల్ మండల పరిధిలోని ఈర్లదిన్నె గ్రామంలో హెల్త్ క్యాంప్ నిర్వహిస్తున్నామని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేస్తున్న హెల్త్ క్యాంప్‌లో వైద్యనిపుణులు అన్ని రకాల ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

నేడు గోరంట్లలో హెల్త్ క్యాంప్

కోడుమూరు రూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష హెల్త్ క్యాంపును సోమవారం మండలంలోని గోరంట్లలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చంద్రశేఖర్ ఆదివారం తెలిపారు. హెల్త్ క్యాంప్‌లో వైద్యనిపుణులు ఆరోగ్య పరీక్షలు చేయడంతోపాటు ఉచితంగా మందులు అందజేస్తారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

మట్టి లారీ సీజ్

కర్నూలు (న్యూసిటీ): బి.తాండ్రపాడు సమీపంలోని టోల్‌ప్లాజా వద్ద అక్రమంగా మట్టి తరలిస్తున్న లారీని సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ ఆదివారం తెలిపారు. సీజ్ చేసిన లారీని భద్రత నిమిత్తం తాలుకా పోలీసుస్టేషన్‌లో పెట్టామని చెప్పారు. లారీలో ఎంత మేర గ్రావెల్‌ను తరలిస్తున్నారని అంచానా వేసి యజమానికి జరిమానా విధిస్తామన్నారు. తనిఖీలో టెక్నికల్ అసిస్టెంట్ బాలు నాయక్, మైనింగ్ సిబ్బంది ఉన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి



జాతీయ స్థాయి తైక్వాండో క్రీడాకారిణి సుగంధిని సన్మానిస్తున్న దృశ్యం

కర్నూలు (టౌన్): మహిళలు ధైర్యంగా అన్ని రంగాల్లో ముందుకు రావాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటలక్ష్మమ్మ అన్నారు. బేటీ బచావో బేటి పఢావో కార్యక్రమంపై దేశవ్యాప్తంగా అవగాహన పెంచేందుకు 70 మంది సీఆర్‌పీఎఫ్ మహిళా అధికారులు కాశీ నుంచి కన్యాకుమారికి ర్యాలీ చేస్తూ కర్నూలుకు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో బేటీ బచావో బేటీ పఢావో కార్యక్రమం నిర్వహించారు. అందులో భాగంగా తైక్వాండో క్రీడాంశంలో జాతీయ స్థాయిలో రాణిస్తున్న జిల్లాకు చెందిన డి. సుగందిని ఘనంగా సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ మాట్లాడుతూ చదువుల్లో కాకుండా అమ్మాయిలు ఆటల్లో కూడా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశాలు ఉన్నాయన్నారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానమన్నారు. కార్యక్రమంలో డీసీపీఓ శారద, సీడబ్ల్యూసీ సభ్యులు మధుసుధాకర్, తైక్వాండో కోచ్ షబ్బీర్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ విజేత సీసీ సంఘం



ఫుట్‌బాల్ పోటీలను ప్రారంభిస్తున్న కార్యదర్శి మాధవరావు

కర్నూలు (టౌన్) : గిప్సన్ సెంట్రల్ బాప్టిస్టు చర్చి 28వ సంఘం సిల్వర్ జూబ్లీ వేడుకల్లో భాగంగా ఆదివారం ఫుట్‌బాల్ పోటీలు నిర్వహించారు. ఫైనల్స్‌లో కోల్స్ చర్చి సంఘం 7 ఏ సైడ్ జట్టు 2-1 స్కోర్‌తో గిప్సన్ సంఘం సీనియర్ జట్టుపై విజయం సాధించింది. క్రీడల నిర్వహణ కమిటీ కార్యదర్శి మాధవరావు మాట్లాడుతూ క్రికెట్ పోటీల్లో 15 జట్లు పాల్గొన్నాయని, కామ్-టు- హెవెన్ జట్టు ప్రత్యర్థి ఇమ్మానియేలు జట్టుపై నిర్ణీత 7 ఓవర్లలో 81 పరుగులు చేసి విజయం సాధించిందని తెలిపారు. వివిధ క్రీడాంశాల్లో విజేతలుగా నిలిచిన జట్లకు సిల్వర్ జూబ్లీ వేడుకల్లో బహుమతులు అందజేస్తున్నట్లు చెప్పారు.

వైభవంగా ప్రారంభమైన దసరా ఉత్సవాలు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



స్వర్ణ కవచాలంకృత లలితాదేవి అలంకరణలో అమ్మ వారు

కోడుమూరు రూరల్: దసరా శరన్నవరాత్రోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా లయాల్లోని శ్రీకాళికాదేవి, శ్రీవల్లెలాంబదేవి, శ్రీకన్యకా పరమేశ్వరీ, శ్రీచౌడేశ్వరీ దేవి అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించి భక్తులు విశేష పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

శ్రీవల్లెలాంబదేవి సన్నిధిలో కుడా చైర్మన్ దంపతులు

దసరా శరన్నవరాత్రులను పురస్కరించుకొని పట్టణంలోని హంద్రీనది ఒడ్డున వెలసిన శ్రీవల్లెలాంబదేవిని ఆదివారం రాత్రి వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త, కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు, జెడ్పీటీసీ సభ్యులు రఘునాథ్‌రెడ్డి దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శ్రీవల్లెలాంబదేవి పల్లకీ సేవా కార్యక్రమంలో కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. అదేవిధంగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

పాణ్యం: దేవీశరన్నరాత్రోత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధల మధ్య ప్రారంభమయ్యాయి. ఆలయాల్లో అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శమిచ్చారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు.



వల్లెలాంబదేవిని దర్శించుకుంటున్న కుడా చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి దంపతులు

గౌరిదేవిగా అమ్మవారు భక్తులకు దర్శమిచ్చారు. అలాగే శ్రీ వాసవి కన్యాకపరమేశ్వరి ఆలయంలో పార్వతిదేవిగా, రైల్వే గేటు వద్ద వెలసిన అమ్మవారు శ్రీ రాజరాజేశ్వరి రూపంలో భక్తులకు దర్శమిచ్చారు. అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

సి.బెళగల్: దసరా ఉత్సవాలు మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాలలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాలలో భాగంగా స్థానిక ఈశ్వర ఆలయ ఆవరణలో భక్తులు దేవి పంచలోహ విగ్రహాన్ని ఘనంగా ప్రతిష్ఠించారు. అనంతరం అర్చకులు సుదర్శమాచార్యులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారు శ్రీదుర్గ మాతగా భక్తులు దర్శనమిచ్చారు. సి.బెళగల్‌లోని తెలుగు వీధిలో కొలువైన గంగమ్మకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గూడూరు: దసరా నవరాత్రోత్సవాలు ఆదివారం పట్టణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. అంభా భవానీ మాత, రాజ రాజేశ్వరి, తెలుగు వీధి చౌడేశ్వరి మాత ఆలయాలలో అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ అలంకరణలో దర్శినమిచ్చిన అమ్మవార్లను భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



శ్రీకాళికా దేవి అలంకరణలో అమ్మవారు



పార్వతి దేవిగా...



సి.బెళగల్‌లో ప్రతిష్ఠించిన అమ్మవారి విగ్రహం



శ్రీదుర్గామాతగా దర్శనమిచ్చిన అమ్మవారు



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు



శ్రీ రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారు



శ్రీ గౌరి దేవి అలంకారంలో...

చేతుల శుభ్రతతో రోగాలు దరిచేరవు



చేతుల శుభ్రతపై మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఎం పుష్పావతి

కోడుమూరు రూరల్ : చేతులను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరి చేరవని ఏపీఎం పుష్పావతి సూచించారు. వరల్డ్ హ్యాండ్ వాష్ డేను పురస్కరించుకుని ఆదివారం కోడుమూరులోని కోటవీధిలో పొదుపు సంఘాల మహిళలకు చేతుల శుభ్రతపై ఏపీఎం అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ మహిళలు వంట తయారీకి, భోజనానికి ముందు తప్పనిసరిగా కనీసం ఇరవై సెకండ్ల పాటు చేతులు కడుక్కోవాలని సూచించారు. కుటుంబంలోని ప్రతి ఒక్కరికీ చేతుల శుభ్రతపై మహిళలు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పొదుపు సంఘాల మహిళలు, సీసీలు, వీఓఏలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

చేతుల శుభ్రతపై ర్యాలీ

గూడూరు: ప్రపంచ చేతుల శుభ్రత దినోత్సవం సందర్భంగా ఆదివారం గూడూరు పట్టణంలో మెప్మా ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జులుపాల వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఆరోగ్య సూత్రాలు పాటించాలని సూచించారు. వైద్యాధికారిణి డాక్టర్ ప్రత్యూష్ణ మాట్లాడుతూ ఆరోగ్యమే మహా భాగ్యమని, ఆరోగ్యంపై ప్రతిఒక్కరూ అవగాహన పెంచుకోవాలన్నారు. ముందుగా నగర పంచాయితీ కార్యాలయంలో ఎస్ఎల్ఎఫ్ రీసోర్స్ పర్సన్స్, స్వయం సహాయక సంఘం సభ్యులకు చేతుల శుభ్రతపై అవగాహన కల్పించారు. మెప్మా సీఎంఓ సూర్యనారాయణ, సీఓ మద్దమ్మ పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

కోడుమూరు రూరల్ : తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల సాగు చేసిన పంటలన్నీ మొలకదశలోనే ఎండిపోయి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఐ మండల కార్యదర్శి రాజు కోరారు. కర్నూలును కరువు జిల్లాగా ప్రకటించాలని కోరుతూ ఆదివారం సీపీఐ నాయకులు కోడుమూరులో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా తీవ్రమైన వర్షాభావ పరిస్థితులు నెలకొనడంతో రైతులు సాగు చేసిన పత్తి, ఉల్లి, మిరప, ఆముదం తదితర పంటలు మొలక దశలోనే ఎండిపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం



నష్టపోయిన రైతులను ఆదుకోవాలంటూ కరపత్రాలు పంపిణీ చేస్తున్న సీపీఐ నాయకులు

చేశారు. రైతుల సమస్యలపై ఈనెల 16న నిర్వహించ తలపెట్టిన ఛలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని రాజు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు చిన్న రాముడు, మధు, గొల్లరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు కోడుమూరులో స్పందన

కోడుమూరు రూరల్ : ప్రజా సమస్యల పరిష్కారంలో భాగంగా కోడుమూరులోని తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ జయన్న ఆదివారం తెలిపారు. స్పందన కార్యక్రమంలో మండలంలోని అన్ని శాఖల అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పిస్తే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ పేర్కొన్నారు.

గూడూరు: ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వెంకటరమణ ఆదివారం ప్రకటనలో తెలిపారు. కార్య క్రమానికి మండలస్థాయి అధికారులు హాజరవుతా రని, ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో సమర్పించి పరిష్కరించుకోవాలని సూచించారు.

సి.బెళగల్: మండల కేంద్రం సి.బెళగల్‌లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని, మండల అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని తహసీల్దార్ శేషఫణి ఆదివారం ప్రకటనలో తెలిపారు. ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు నిర్వహించే స్పందన కార్యక్రమానికి అధికారుల గైర్హాజరైతే చర్యలు తప్పవని హెచ్చరించారు.

నేడు గడపగపడకు మన ప్రభుత్వం

పాణ్యం: మండల పరిధిలోని ఆలమూరు గ్రామంలో సోమవారం ఉదయం 8 గంటలకు గపడపగడకు-మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ దస్తగిరి ఆదివారం తెలిపారు. సాయంతం 3 గంటలకు ప్రారంభమయ్యే కార్యక్రమానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి హాజరవుతారని, మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటర్లు పాల్గొనాలని సూచించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించడంతోపాటు ఆయా కుటుంబాలకు వర్తించిని సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందజేస్తారన్నారు. అదేవిధంగా ఎమ్మెల్యే ప్రజల సమస్యలు తెలుసుకుని పరిష్కార చర్యలు చేపడుతారని వివరించారు.

పూర్వవిద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



గురువులతో గడివేముల జెడ్పీ పాఠశాల పూర్వవిద్యార్థులు

గడివేముల: మండల కేంద్రం గడివేముల జిల్లా పరిషత్ పాఠశాల పూర్వవిద్యార్థుల(2003-04 బ్యాచ్) ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఉత్సాహంగా జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఒకేవేదికపై చేరడంతో పండుగ వాతావరణం నెలకొంది. ఒకరినొకరు ఆప్యాయంగా పలుకరించుకుంటూ యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. అలనాటి జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు శివారెడ్డి, షంషీర్‌మియ్యా, జయమ్మ, దర్గయ్య, చంద్రశేఖర్, సోమశేఖర్, ఆనంద్, చెన్నప్ప, అలీలను ఘనంగా సన్మానించారు. అంతకు ముందు గడివేముల పాత బస్టాండ్ నుంచి స్కూల్ వరకు ర్యాలీగా నిర్వహించారు.

అబ్దుల్ కలాం సేవలు ఎనలేనివి

కర్నూలు(రాజ్‌విహార్): భారత మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం దేశానికి అందించిన సేవలు ఎనలేనివని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సుభాష్ చంద్రబోస్ అన్నారు. ఆదివారం స్థానిక బిర్లా కాంపౌండ్‌లోని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. కలాం చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ గొప్ప శాస్త్రవేత్త అయిన అబ్దుల్ కలాం మిసైల్స్ మెన్‌గా పేరు తెచ్చుకొని, దేశానికి విశిష్ట సేవలందించారన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ శ్వేతారెడ్డి, పార్టీ నాయకులు ధనుంజయ ఆచారి, యూసుస్, రసూల్‌ఖాన్, శివ తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్ కలామ్ సేవలు మరువలేం

కర్నూలు(సెంట్రల్): డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలామ్ సేవలను దేశం మరువలేదని ఎస్‌డీపీఐ నగర అధ్య క్షుడు అశ్వాక్ హుస్సేన్ అన్నారు. ఆదివారం



అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సుభాష్ చంద్రబోస్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఎస్‌డీపీఐ పార్టీ కార్యాలయంలో అబ్దుల్ కలామ్ జయంతిని నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు జలీల్, చాంద్, షఫీ, షేక్షావలి, హబీబ్‌ఖాన్, అబ్దుల్లా, సలీంబాషా పాల్గొన్నారు.

నొప్పి తెలియకుండా గమ్మత్తు!

- అనెస్తీషియాతో నొప్పి లేకుండా ఆపరేషన్లు
- ప్రసవాలు కూడా
- పెయిన్‌క్లినిక్‌లకు పెరుగుతున్న ఆదరణ
- కర్నూలు పెద్దాసుపత్రిలో ప్రతి ఏటా 30వేల శస్త్రచికిత్సలు
- నేడు ప్రపంచ అనెస్తీషియా దినోత్సవం

కర్నూలు(హాస్పిటల్): ప్రమాదాల్లో మనకు చిన్న గాయమైతేనే నొప్పితో అల్లాడిపోతాం. అలాంటిది ఒక మనిషికి ఆపరేషన్ చేసేందుకు కత్తితో కోసి లోపలి అవయవాలను సరిచేసి, ఆపై చర్మానికి కుట్లు వేస్తారు. ఈ మొత్తం ప్రక్రియను తలచుకుంటేనే ఆందోళన మొదలవుతోంది కదూ...మత్తుమందు(అనెస్తీషియా) వచ్చాక గుండె ఆపరేషన్లు సైతం ఎంతో హాయిగా నొప్పిలేకుండా చేసుకునే వీలుకలిగింది. నే ప్రపంచ అనెస్తీషియా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం..

అనెస్తీషియా వైద్యులు.. 70 వేలకుపైగా ఆపరేషన్లు

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని అనెస్తీషియా విభాగంలో మూడు యూనిట్లు ఉన్నాయి. ఇందులో ముగ్గురు ప్రొఫెసర్లు, నలుగురు అసోసియేట్, 16 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు విధులు నిర్వహిస్తున్నారు. వీరితో పాటు ఏడాదికి 15 మంది పీజీలతో కలుపుకుని మూడేళ్లకు మొత్తం 45 మంది పీజీలు ఇక్కడ చదువుకుంటూ వైద్యసేవలందిస్తూ ఉంటారు. ఇక్కడ 12 ఆపరేషన్ల థియేటర్లతో పాటు ఎంఆర్ఐ, సీటీ స్కాన్, కేథలాబ్ విభాగాలు పలుమార్లు అనెస్తీషియా విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తూ ఉంటారు. వీటిలో ప్రతి నెలా సగటును 1,250 మేజర్, 1,250 మైనర్ సర్జరీలు కలిపి ఏటా దాదాపు 30వేల ఆపరేషన్లు నిర్వహిస్తున్నారు. అలాగే నగరంలోని పలు ప్రైవేటు ఆసుపత్రులు, ఉమ్మడి జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నిత్యం ఆపరేషన్లు జరుగుతుంటాయి. ఉమ్మడి జిల్లాలో మొత్తం వంద మందికి పైగా మత్తు మందు వైద్యులు ఉన్నారు. వీరి ఆధ్వర్యంలో ఏటా 70వేలకు పైగా శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నారు.

త్వరలో పెయిన్‌క్లినిక్ ఏర్పాటు

దీర్ఘకాలిక నొప్పులకు చికిత్స చేయడానికి పెయిన్ క్లినిక్స్ అందుబాటులోకి వచ్చాయి. కొన్ని ప్రైవేటు ఆసుపత్రుల్లో ఇప్పటికే వీటిని ఏర్పాటు చేసి రోగులకు నొప్పుల నుంచి ఉపశమనం కలిగిస్తున్నారు. ఇందులో దీర్ఘకాల నొప్పులకు ఆధునిక పరికరాలు (ఎక్స్‌రే మిషన్, సిటి స్కానింగ్ మిషన్, అల్ట్రాసౌండ్ మిషన్, రేడియోఫ్రీక్వెన్సీ అబ్లేషన్ మిషన్)ను ఉపయోగించి కుట్లులేని ప్రత్యేకమైన ఇంజెక్షన్ల ద్వారా నొప్పి తగ్గిస్తారు. ఇందులో భాగంగా నడుంనొప్పి, మోకాలునొప్పి, మెడనొప్పి, తలనొప్పి, క్యాన్సర్ నొప్పులకు చికిత్స చేసి నొప్పి తగ్గిస్తారు. సాధారణ కాన్పుల వల్ల కలిగే నొప్పులకు లేబర్ అనెల్జిషియా పద్ధతితో నొప్పిలేని కాన్పు(పెయిన్‌లెస్ లేబర్) సైతం నిర్వహిస్తున్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో త్వరలో పెయిన్ క్లినిక్‌తో పాటు పెయిన్‌లెస్ లేబర్‌లను సైతం ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు.

మత్తు మందు కనిపెట్టక ముందు..

పూర్వం మత్తుమందు కనిపెట్టకముందు మనదేశానికి చెందిన శుశ్రుత అనే శస్త్రచికిత్సా వేత్త రోగులకు మద్యాన్ని తాగించి, వారు మద్యం మత్తులో ప్రపంచాన్ని పట్టించుకోకుండా ఉన్న స్థితిలోకి వెళ్లినప్పుడు శస్త్రచికిత్స చేసి చెడిపోయిన శరీర భాగాలను చక్కగా సవరించేవారు. ఆయన శస్త్రచికిత్స, ప్లాస్టిక్ సర్జరి అనే రెండు విభాగాలకు మార్గదర్శిగా నిలిచి శరీరంలో ఏ శస్త్రచికిత్స అయినా రోగికి నొప్పి లేకుండా ఉండటం ఎంతో అవసరమైని ఒక నిర్దిష్టమైన సంకేతానిచ్చాడు. అమెరికాలోని బోస్టన్ నగరంలో మాసాచూట్స్ జనరల్ ఆసుపత్రిలో విల్లియమ్ థామస్ గ్రీన్ మోర్టన్ అనే వైద్యుడు 1846 అక్టోబర్ 16న 'డైఇథయిల్ ఈథర్' అనే త్వరితంగా ఆవిరయ్యే రసాయన ద్రవంతో రోగికి నొప్పి లేకుండా ఆపరేషన్ చేసి సఫలీకృతుడయ్యాడు. ఈ నేపథ్యంలోనే ప్రతి ఏటా అక్టోబర్ 16న ప్రపంచ అనెస్తీషియా దినంగా నిర్వహిస్తున్నారు.

క్రిటికల్ కేర్‌లో కీలకపాత్ర

రోగి ప్రాణాపాయస్థితిలో అత్యవసర చికిత్స అవసరమై, అపస్మారక స్థితిలో ఉన్నప్పుడే అత్యవసర చికిత్స రథసారథిగా ఉండి రోగి ముఖ్యమైన అవయవాలు ఇబ్బందిలో పడినప్పుడు వాటిని ఒక కొలిక్కి తీసుకొచ్చి ప్రాణాలను కాపాడటంలో ప్రధాన సూత్రదారి వహించేది అనెస్తీషియా వైద్యుడు. క్లుప్తంగా చెప్పాలంటే క్రిటికల్ కేర్ విభాగంలో కీలకమైన వైద్యులు వీరే. రోగి ఆహారం తీసుకోలేని స్థితిలో ఉన్నప్పుడు సిరలు, జీర్ణవాటిక ద్వారా ప్రత్యేక రీతిలో శరీరానికి అవసరమైన పిండి, మాంసకృతులు ఇతర అత్యవసర పోషక పదార్థాలను అందజేయడంలో అతనే కీలక పాత్ర పోషిస్తాడు. అత్యవసర చికిత్సలో రోగి విషమ పరిస్థితిలో ఉన్నప్పుడు ప్రాణాలను కాపాడే క్రిటికల్ కేర్ ఫిజిషియన్ కూడా మత్తు మందు డాక్టరే.



● అనెస్తీషియా వైద్యుడంటే...!

తలనుంచి గోరు దాకా శరీరంలోని ప్రతి అవయవానికి సంబంధించి శస్త్రచికిత్సకు, వ్యాధిపరంగా వచ్చే ఇబ్బందులకు తనకంటూ ఉన్న ఒక ప్రత్యేక శైలిలో నివారణోపాయాలను కనుగొంటూ రోగికి ప్రాణాపాయం కలగకుండా, శరీరంలోని ప్రధానమైన అవయవాలైన మెదడు, గుండె, వెన్నుపూస, ఊపిరితిత్తులు, కాలేయం, మూత్రపిడాలు, జీర్ణాశయం, కండరాలు, ఎముకలు, కళ్లు, చెవి, ముక్కు, గొంతు, చర్మం వంటి అన్ని అవయవాలకు ఎలాంటి నొప్పి, ఇబ్బంది లేకుండా శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు గట్టి పునాదిని వేసే వారే అనెస్తీషియా వైద్యులు. ఒక్క మాటలో చెప్పాలంటే వైద్యశాస్త్రంలో అసలైన, సిసలైన బహుముఖ ప్రజ్ఞాశాలి వీరు మాత్రమే.

ఆపరేషన్ సమయంలో కీలకం



ఆపరేషన్ నిర్వహించే సమయంలో అనెస్తీషియా వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆసుపత్రిలో అన్ని విభాగాల కంటే మాదే పెద్ద డిపార్ట్‌మెంట్. ప్రస్తుతమున్న యూనిట్లతో పాటు త్వరలో స్టేట్ క్యాన్సర్ యూనిట్‌లో 5 అసిస్టెంట్ ప్రొఫెసర్, ఒక అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులు మంజూరయ్యాయి. అక్కడ మూడు ఆపరేషన్ థియేటర్లు కూడా ఏర్పాటు కానున్నాయి. ఎమర్జెన్సీ మెడిసిన్‌లో భాగంగా క్యాజువాలిటీలో మత్తుమందు వైద్యులు ఉత్తమ సేవలందిస్తున్నారు.

–డాక్టర్ జి. విశాల, అనెస్తీషియా విభాగం హెచ్ఓడి, కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల

నొప్పిలేని చికిత్స



నొప్పిలేని గమ్మత్తు చికిత్స అనెస్తీషియా. ఇది ఆవిర్భావం కాకపోతే ఇన్ని రకాల ఆరోగ్య సమస్యలు పరిష్కారమయ్యేవి కావు. అనెస్తీషియా లేకుండా ఆరోగ్యసంరక్షణ ఊహించడం దాదాపు అసాధ్యం. సాధారణ అనెస్తీషియాలో రోగులు అపస్మారక స్థితిలో ఉంటారు. వారు ఎలాంటి అనుభూతికి లోనుకారు. శ్వాస తీసుకోవడం, ఐవీ ద్వా రా ఔషధాన్ని స్వీకరిస్తారు. అనెస్తీషియా విధానం రాకపోతే శస్త్రచికిత్సలు చేయడం కష్టమయ్యేది. అనెస్తీషియా ఆవిర్భావం విప్లవాత్మకమైనది.

– డాక్టర్ బి. సుదర్శన్‌రెడ్డి, క్రిటికల్ కేర్ వైద్యనిపుణులు, కర్నూలు